నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, గురువారం 19 సెప్టెంబర్ 2024 | KARIMNAGAR

# ఆంక్షలు లేకుండా మాఫీ చేయాలి



జగిత్యాల కలెక్టర్ ఆవరణలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పక్కన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

- అనేక కొర్రీలు పెట్టి వేలాది మందికి ఎగనామం పెట్టిన్రు
- చేసింది గోరంతే, చెప్పుకొనేది కొండంత
- విలేకరులతో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ • బాధిత రైతులతో కలిసి జగిత్యాల కలెక్టర్‌కు వినతి • పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

జగిత్యాల, సెప్టెంబర్ 18: 'కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేస్తామని ఊరించి ఉసూరుమనిపించింది. అనేక కొర్రీలు పెట్టి వేలాది మందికి ఎగనామం పెట్టింది. ఇంటికి ఒక్కరికీ అని, రేషన్ కార్డు ఉన్నవారికి మాత్రమేనని ఇలా పలు రకాలు నిబంధనలు పెట్టి ఎగ్గొట్టిన్రు. కాంగ్రెస్ మాటలు నమ్మి రైతులు నిండా మునిగిన్రు. ఇప్పుడు బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరిగి వేసారుతున్నరు' అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. ఇది ప్రభుత్వానికి సరికాదని, ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కాని రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, రైతులతో కలిసి బుధవారం కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. రుణమాఫీ కానీ రైతుల వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడారు. రుణమాఫీ పూర్తిగా అంకెల గారడీ అని, చేసింది గోరంత అయితే, చెప్పుకొనేది కొండంత అని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి కుర్చీలో కూర్చునే దాకా ఓ మాట, తర్వాత మరో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. రేవంత్ సర్కారు అబద్ధపు పునాదుల మీద ఏర్పడిందని, అది ఎంతో కాలం నిలువదన్నారు. ముఖ్యమంత్రి రైతులందరికీ మాఫీ చేశామని చెబుతుంటే, మరోవైపు డిప్యూటీ సీఎం, మంత్రులు మాత్రం ఇంకా ఇవ్వాల్సి ఉందని, 'ఇగో ఇస్తం, అదిగో ఇస్తం' అని చెబుతూ మభ్యపెడుతున్నారని, ప్రభుత్వ పెద్దల వద్దే స్పష్టత లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. కేసీఆర్ ఇచ్చిన రైతు బంధు పైసలే రుణమాఫీకి డైవర్ట్ చేశారని, అనేక ఆంక్షలు పెట్టి వేలాది మందికి మాఫీ ఎగ్గొట్టారని, పైకి మాత్రం రైతులందరికీ రూ.2లక్షలు మాఫీ చేసి బడాయి కొడుతున్నారని ధ్వజమెత్తారు. రుణమాఫీ కాని రైతులు బ్యాంకులు, అధికారుల చుట్టు తిరుగుతూ అలసిపోతున్నారని, రేషన్ కార్డు వద్దని ముఖ్యమంత్రి అంటాడని, రేషన్ కార్డు కావాలని బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులు అంటున్నారని, అసలు ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ఒక విధానం అంటూ ఉందా..? అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని, ఎలాంటి ఆంక్షలు లే కుండా రుణమాఫీ చేయాలని, లేదంటే రైతు ఉద్యమం మొదలవుతుందని, పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ హరి చరణ్ రావు, పలువురు ప్రజాప్రతినిధులు రుణమాఫీ కానీ రైతులు పాల్గొన్నారు.




# గోస పెట్టడం సరికాదు

రాస్తారోకో చేస్తున్న దళిత బంధు రెండో విడుత నిధులు రాని లబ్ధిదారులు

- రెండో విడుత దళిత బంధు డబ్బులు ఇవ్వండి..?
- హుజూరాబాద్‌లో లబ్ధిదారుల ఆందోళన

హుజూరాబాద్ టౌన్, సెప్టెంబర్ 18: 'దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని తెచ్చి అమలు చేసింది. ₹10లక్షల్లో తొలుత ₹5 లక్షలు ఇస్తే మేం వ్యాపారాలు పెట్టుకున్నం. కానీ, కాంగ్రెస్ సర్కారు వచ్చి మా పొట్టకొట్టింది. రెండో విడుత ఇవ్వాల్సిన ₹5లక్షలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతుంది' అని హుజూరాబాద్ లబ్ధిదారులు మండిపడ్డారు. తామేం పాపం చేశామని, తమను గోస పెట్టినోళ్లు తమ ఉసురు తాకిపోతరని శాపనార్థాలు పెట్టారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా దళితబంధు సాధన సమితి సభ్యులు మాట్లాడుతూ దళితులపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతున్నదన్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఖమ్మం చింతకాని మండలంలో దళితబంధు నిధులు విడుదల చేసి, హుజూరాబాద్‌లో మాత్రం రెండో విడత నిధులు ఆపడాన్ని తప్పుబట్టారు. ఇక్కడి దళితులు ఏం పాపం చేశారో..? చెప్పాలని ప్రశ్నించారు. ఉపముఖ్యమంత్రి భట్టి హుజూరాబాద్ నియోజకవర్గంపై సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారన్నారు. 10 నెలల నుంచి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా, ఒత్తిడి చేస్తున్నా చెవిటోడి ముందు శంఖం ఊదిన చందాన ప్రభుత్వ పరిస్థితి ఉందని వాపోయారు. దళితబంధు సాధన సమితికి భయపడే మంత్రి పొన్నం ప్రభాకర్ తమను నిరసన తెలుపకుండా అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా నిధులు వెంటనే విడుదల చేయాలని, లేకుంటే ముఖ్యమంత్రి కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సురేశ్, రాజేశ్, నరేశ్, ఆకాశ్, భిక్షపతి, నాగరాజు, రమేశ్, కుమార్, విజయ్, శ్రీకాంత్, అర్జున్, సరిత, అరుణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

# చేయిచేయి కలిపి..

చందాలు వేసుకొని కట్ట రోడ్డును బాగు చేయించుకున్న రైతులు



కరకట్ట రోడ్డును చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్



మరమ్మతులకు ముందు జూలపల్లి గ్రామ పెద్ద చెరువు కట్టపై రోడ్డు దుస్థితి

కమాన్‌పూర్, సెప్టెంబర్ 18 : ఇటీవల కురిసిన వర్షాలతో కమాన్‌పూర్ మండలం జూలపల్లి గ్రామ పెద్ద చెరువు కట్టపై రోడ్డు అధ్వానంగా మారింది. మోకాలి లోతులో బురదమయమైంది. ఈ రోడ్డు గుండా వెళ్లేందుకు రైతులు, కూలీలు నానా అవస్థలుపడ్డారు. ఈ క్రమంలో 'జూలపల్లి కరకట్టపై నడక నరకమే' శీర్షికన ఈ నెల 12న 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరించారు. ఇకలాభం లేదనుకొని రైతులే రోడ్డుకు మరమ్మతులు చేసేందుకు ముందుకువచ్చారు. తలాకొంత చందాలు వేసుకొని రోడ్డును బాగు చేసుకున్నారు. మంత్రి ఇలాకాలో ప్రజా సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారని రైతులు వాపోయారు.

# మొరాయించిన ఆర్టీసీ బస్సు



బస్సును నెట్టుతున్న ప్రయాణికులు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 18 : తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఆర్టీసీ బస్సు మొరాయించింది. సిద్దిపేట డిపోకు చెందిన బస్సు కామారెడ్డి నుంచి సిరిసిల్ల మీదుగా సిద్దిపేటకు వెళ్తున్నది. ఈ క్రమంలో తంగళ్లపల్లి మండల కేంద్రానికి చేరుకోగానే ప్రయాణికుల కోసం ఆగింది. ఆ తర్వాత తిరిగి స్టార్ట్ కాలేదు. దాదాపు అర గంటపాటు సతాయించడంతో ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. చివరకు స్థానికుల సాయంతో బస్సును డౌన్‌కు తోయడంతో స్టార్ట్ అయింది.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం

# పోటాపోటీ!

## ప్రయత్నాలు ముమ్మరం చేసిన ఆశావహులు

- పోటీపడుతున్న అభ్యర్థులు
- తెరపైకి కొత్త పేర్లు.. ఇప్పటికే ప్రచారం షురూ
- వచ్చే నెల ఒకటి నుంచి ఎన్‌రోల్‌మెంట్
- ఎవరికి వారే భారీగా నమోదుకు ఏర్పాట్లు
- ఈ నెల చివరి వారంలో నోటిఫికేషన్!
- కసరత్తు చేస్తున్న అధికారులు
- అదృష్టాన్ని పరీక్షించుకునే దిశగా ఆశావహుల ప్రయత్నాలు

**కరీంనగర్-మెదక్, నిజామాబాద్-ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం దక్కించుకునేందుకు ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటికే పలువురు ప్రచారాన్ని కూడా ప్రారంభించి ఓట్లను సైతం అభ్యర్థిస్తున్నారు. మరోవైపు ప్రధానపార్టీలు సైతం తమ అభ్యర్థులను రంగంలోకి దింపేందుకు సమాలోచనలు చేస్తున్న క్రమంలో, ఆయా పార్టీల పెద్దల మద్దతు కోసం పలువురు ప్రణాళికాబద్ధంగా పావులు కదుపుతున్నారు. వచ్చే నెల ఒకటి నుంచి ఎన్‌రోల్‌మెంట్ ప్రారంభమవుతుండగా, ఆ లోపే చాలా మంది ఔత్సాహిక అభ్యర్థులు నాలుగు ఉమ్మడి జిల్లాల్లో కలియ తిరుగుతున్నారు. గత ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 17 మంది పోటీ పడగా, ఈ సారి ఆ సంఖ్య భారీగా పెరిగే అవకాశం కనిపిస్తున్నది. అంతేకాదు ఓటర్ల సంఖ్య 2.5 లక్షలకు చేరుతుందని అధికారులు అంచనా వేస్తుండగా, ఈ సారి ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రుల గెలుపు కూడా అంత సునాయాసంగా ఉండదనే మాట వినిపిస్తున్నది. ఇదిలా ఉంటే ఆగం కావద్దని, ఆచితూచీ ఓటువేయాలన్న చర్చ పట్టభద్రుల్లో జోరుగా సాగుతున్నది.**



1.సర్దార్ రవీందర్ సింగ్ (మాజీ మేయర్)
2.డాక్టర్ బీఎన్‌రావు (బీఎన్‌రావు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు)
3.యాదగిరి శేఖర్‌రావు (ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు)
4.నరేందర్‌రెడ్డి (అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత)
5. వెలిచాల రాజేందర్ రావు (కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి)
6. గుజ్జుల రామకృష్ణారెడ్డి (మాజీ ఎమ్మెల్యే)
7. పొల్సాని సుగుణాకర్ రావు (బీజేపీ సీనియర్ నాయకుడు)
8. రాణి రుద్రమ (బీజేపీ సీనియర్ నాయకురాలు)
9. రఘునాథ్ (బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు)

కరీంనగర్, సెప్టెంబర్ 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఈ సారి కరీంనగర్-మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాకు సంబంధించిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు అతి త్వరలో జరుగనున్నాయి. ఈసారి పోటాపోటీగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2019 మార్చిలో పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు జరుగగా, 17 మంది పోటీ పడ్డారు. అందులో కాంగ్రెస్ పార్టీకి చెందిన టీ జీవన్‌రెడ్డి విజయం సాధించి, ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. జీవన్‌రెడ్డి పదవీ కాలం వచ్చే మార్చి 29తో ముగియనున్నది. ఈ నేపథ్యంలోనే ఈ ఎన్నికలకు సంబంధించి వచ్చే నెల ఒకటి నుంచి ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవడానికి ఇప్పటికే ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. అందుకు సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెల చివరి వారంలో వెలువరించేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తున్నది. నోటిఫికేషన్ రాగానే ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ మొదలు కానుండగా, అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నది.

### ఎవరికి వారే ప్రయత్నాలు

గత ఎన్నికల్లో 17 మంది అభ్యర్థులు బరిలో నిలబడ్డారు. ఈ సారి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓ వైపు స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నిలబడే అవకాశాలు ఉండగా, మరోవైపు ప్రధాన పార్టీల మద్దతు కోసం మెజార్టీ అభ్యర్థులు ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ మద్దతు కోసం ఆశావహులు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. తాజాగా ఉన్న సమాచారం ప్రకారం చూస్తే మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, బీఎన్‌రావు పౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీఎన్‌రావు, ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే వీరు ప్రచారం కూడా ప్రారంభించారు. రవీందర్‌సింగ్ రూపాయికే ప్రతి పట్టభద్రుడికి ఇన్సూరెన్స్ చేయిస్తానని ఇప్పటికే ప్రకటించారు. మరోవైపు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను కలిసి మద్దతు కోరుతున్నారు. న్యాయవాదిగా, అలాగే రాజకీయ అనుభవజ్ఞుడిగా తనకున్న అనుభవాన్ని వినియోగించి పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తామని చెబుతున్నారు. నాలుగు జిల్లాల్లో వివిధ సంఘాల నాయకులను కలుస్తున్నారు. టార్గెట్ ఎమ్మెల్సీ పేరిట వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారు. బీఎన్‌రావు ఉమ్మడి నాలుగు జిల్లాల్లో వైద్య రంగానికి సంబంధించి ఉన్న అన్ని సంఘాల మద్దతు కోరుతున్నారు. మరోవైపు పలు స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయా వర్గాలతో మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ పెద్దల మద్దతు కోరుతూనే ఇంటలెక్చువల్ పేరుతో వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసి తన అభిప్రాయాలు షేర్ చేస్తూ సూచనలు, సలహాలు తీసుకుంటూ మద్దతు కూడగడుతున్నారు. పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం గళమెత్తడానికి తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఇక ట్రస్మా మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు ప్రైవేట్ విద్యాసంస్థల మద్దతు కోరుతున్నారు. తాను గెలిస్తే విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తానని నాలుగు జిల్లాల అసోసియేషన్లను కలిసి వివరిస్తున్నారు. బీఆర్ఎస్ పెద్దల మద్దతు కోరుతూనే పలు వాట్సప్ గ్రూపులు ఏర్పాటుచేసి ప్రచారం చేస్తున్నారు. వీరితోపాటు బీఆర్ఎస్ మద్దతు కోసం వేర్వేరు జిల్లాల నుంచి కూడా కొంత మంది ఆశావహులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తున్నది. ఎన్‌రోల్‌మెంట్ నాటికి వారి పేర్లు కూడా బయటకు వచ్చే అవకాశమున్నది. కాంగ్రెస్ నుంచి ఇద్దరు అభ్యర్థులు టికెట్ ఆశిస్తున్నట్లుగా వార్తలు వస్తుండగా, మున్ముందు ఈ పార్టీ నుంచి టికెట్ కోరే వారి సంఖ్య పెరిగే అవకాలున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పొందిన వెలిచాల రాజేందర్‌రావు టికెట్ ఆశిస్తున్న వారిలో ఉన్నారు. అందులో నరేందర్‌రెడ్డి మొదటిసారిగా బరిలోకి దిగుతున్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల్లోనూ ఆయనకు విద్యాసంస్థలు ఉండడం, అందులో పెద్ద మొత్తంలో పట్టభద్రులైన ఉద్యోగులు, యువకులు ఉండడం, అలాగే విద్యాసంస్థల నుంచి బయటకు వెళ్లిన విద్యావంతులు ఉండడం వంటి అంశాలు తనకు పాజిటివ్ అవుతుందని భావిస్తున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ నుంచి టికెట్ తనకే వస్తుందని, అదే పార్టీ నుంచి పోటీ చేస్తానని బుధవారం కరీంనగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అంతేకాదు ఇప్పటికే ఆయన తన ప్రచారాన్ని ప్రారంభించి వివిధ వర్గాలను కలుస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత వెలిచాల రాజేందర్‌రావు తన పూర్తి సమయాన్ని రాజకీయాల కోసం వెచ్చిస్తున్నారు. ప్రత్యేకంగా ఒక కార్యాలయాలన్ని తీసుకొని తన కార్యకలాపాలను నడుపుతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బాహాటంగా బయట పడకపోయినా అంతర్గతంగా మాత్రం టికెట్ తనకే వస్తుందన్న ధీమాను తన సన్నిహితులతో వ్యక్తం చేయడమేకాకుండా, తనదైన శైలిలో తన వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లుగా తెలుస్తున్నది. ఇక బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు పొల్సాని సుగుణాకర్‌రావు, మరో సీనియర్ నాయకురాలు రాణి రుద్రమ, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ కూడా టికెట్ ఆశిస్తున్నారు. ఇప్పటికే రఘునాథ్ ఆ పార్టీ పెద్దలను కలిసి టికెట్ ఇవ్వాలని కోరారు. ఇలా ఎవరికి వారే తమకు అవకాశం కల్పించాలని అధిష్టానానికి దరఖాస్తు ఇవ్వడంతో పాటు ఎవరి మార్గాల్లో వారు టికెట్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారని తెలుస్తున్నది. కాగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న నాయకుల్లో పలువురు ఇప్పటికే వారి వారి ప్రచారాలను ప్రారంభించగా, బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న వారిలో మాత్రం ఇంకా ఆ హుషారు కనిపించడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీరితో పాటు పలువురు ఆయా జిల్లాల నుంచి స్వతంత్రంగా రంగంలోకి దిగేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

### పెరుగనున్న ఓటర్లు

గతంతో పోలిస్తే ఈసారి పట్టభద్రుల ఓటర్ల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2019లో మొత్తం 1,96,321 ఓట్లు ఉండగా, ఈ సారి ఆ సంఖ్య 2.5 లక్షలకు పైగా చేరొచ్చని అధికారులు అంచనాలు వేస్తున్నారు. అందుకు కావాల్సిన ఏర్పాట్లను అధికార యంత్రాగం చేస్తుండగా, మరోవైపు ఆశావహులైన అభ్యర్థులు వారి వారి ఆధ్వర్యంలో భారీగా ఎన్‌రోల్ మెంట్ చేయడానికి ఉత్సాహం చూపుతున్నారు. పాత జాబితాను తీసుకొని ఇప్పటికే పలువురు ప్రచారం ప్రారంభించడమే కాకుండా, సదరు ఓటర్ల నుంచి తిరిగి ఎన్‌రోల్‌మెంట్‌కు కావాల్సిన వివరాలు, సర్టిఫికెట్లు సేకరిస్తున్నారు. ఆ వివరాలను తీసుకొచ్చి వారి వారి పరిధిలో ఉంచుకొని, ఎన్‌రోల్‌మెంట్ ప్రారంభం కాగానే ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ప్రత్యేకంగా కంప్యూటర్లు, ఆపరేటర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఈసారి పట్ట భద్రుల సంఖ్య భారీగా పెరుగుతుందని అంచనాలున్నాయి. అయితే ప్రకటనలు, ప్రచారాలను చూసి కాకుండా నికార్సుగా తమ సమస్యల పరిష్కారం కోసం పనిచేసే నాయకులకే ఓటు వేయాలని పట్టభద్రులు ఆలోచిస్తున్నారు. ఏ నలుగురు పట్టభద్రులు కలిసినా ఇదే విషయంపై చర్చించుకుంటున్నారు. మొత్తంగా నోటిఫికేషన్‌కు ముందే పట్టభద్రుల ఎమ్మెల్సీ ప్రచారం ప్రారంభం కావడం, గెలుపుకోసం ఆశావహులు ప్రయత్నాలను ముమ్మరం చేయడం చూస్తే ఈ సారి గెలుపు అంతా సునాయం కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**2019లో జిల్లాల వారీగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు**

| జిల్లాపేరు | పురుషులు | మహిళలు | థర్డ్ జండర్ | మొత్తం |
|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 5687 | 2100 | 2 | 7789 |
| జగిత్యాల | 11782 | 5190 | 0 | 16972 |
| జయశంకర్ భూపాలపల్లి | 664 | 219 | 1 | 884 |
| కామారెడ్డి | 7492 | 2988 | 1 | 10481 |
| కరీంనగర్ | 23,268 | 12,428 | 7 | 35,703 |
| కొంరంభీం | 3,117 | 1,238 | 0 | 4,355 |
| మంచిర్యాల | 9,670 | 4,308 | 2 | 13,980 |
| మెదక్ | 5,818 | 1,889 | 0 | 7.707 |
| నిర్మల్ | 8,486 | 3,859 | 0 | 12,345 |
| నిజమాబాద్ | 17,076 | 8,926 | 6 | 26,008 |
| పెద్దపల్లి | 11,657 | 5,448 | 2 | 17,107 |
| రాజన్నసిరిసిల్ల | 7,390 | 3,192 | 2 | 10,584 |
| సంగారెడ్డి | 9,228 | 3,789 | 1 | 13,018 |
| సిద్దిపేట | 11,110 | 4,316 | 1 | 15,427 |
| హన్మకొండ | 2,773 | 1.187 | 1 | 3,961 |
| మొత్తం | 1,35,218 | 61,077 | 26 | 1,96,321 |

# విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాం

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్
- కరీంనగర్ ఐటీఐలో ఏఆర్ వీఆర్ ల్యాబ్ ప్రారంభోత్సవం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ విద్యానగర్, సెప్టెంబర్ 18: కరీంనగర్ ఐటీఐ కళాశాలలో చదివే విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ బర్త్‌డే నేపథ్యంలో 'సేవా పక్వాడా' పక్షోత్సవాల్లో భాగంగా రాష్ట్రంలో తొలిసారిగా కరీంనగర్ ఐటీఐ కళాశాలలో పైలెట్ ప్రాజెక్టు కింద ఏఆర్, వీఆర్ (అగ్ మెంటెడ్ రియాలిటీ, వీడియో వర్చువల్ రియాలిటీ) ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఇది పైలెట్ ప్రాజెక్టు మాత్రమే.. పూర్తిస్థాయిలో ల్యాబ్‌ను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కరీంనగర్ ఐటీఐ కళాశాలలో చదువుకున్నామని గర్వంగా చెప్పుకొనే స్థాయికి ప్రతి విద్యార్థి చేరాలన్నారు. టెక్నాలజీని అప్‌డేట్ చేసుకుని విద్యార్థులను తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఏఆర్ వీఆర్ ల్యాబ్‌ను పైలెట్ పద్ధతిలో ఎంపీ లాడ్స్ నిధులతో ఏర్పాటు చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది గానీ.. ఇంతవరకు ఆచరణకు నోచుకోలేదన్నారు. వాష్‌రూమ్‌కు ఇబ్బందిగా ఉందని, కిటికీలు దెబ్బతిన్నాయని విద్యార్థులు మంత్రికి దృష్టికి తీసుకెళ్లగా, కళాశాలలో కనీస సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.

# ఆర్టీసీ బస్సులో ఆగిన గుండె

- గుండెపోటుతో ప్రయాణికుడి మృతి



రవీందర్ (ఫైల్)

వెల్గటూర్, సెప్టెంబర్ 18: ఓ ప్రయాణికుడు ఆర్టీసీ బస్సులోనే కుప్పకూలిపోయాడు. గుండెపోటుతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబ సభ్యులు, ప్రయాణికుల వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం తిరుమలాపూర్ గ్రామానికి చెందిన పబ్బ రవీందర్(45) పనిపై మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలం గూడెం వెళ్లాడు. తర్వాత కరీంనగర్ డిపోకు చెందిన ఆర్టీసీలో బస్సులో తిరుగు పయనం అయ్యాడు. బస్సు వెల్గటూర్ మండలం పాశిగామ స్టేజీ వద్దకు రాగానే సీటులోనే కుప్పకూలిపోయాడు. తోటి ప్రయాణికులు గమనించి వెంటనే డ్రైవర్‌కు, 108కి సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి అంబులెన్స్ వచ్చేసరికే మృతిచెందాడు. రవీందర్ గతంలో ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

లక్కీ డ్రా ఫలితాలు-2024
విఘ్నేశ్వర నవరాత్రోత్సవములు
Hero Hf 100 Bike 1) 40765 | LED Colour Tv 2) 53663 | Washing Machine 3) 53126
Consolation Prizes 4) 17599 5) 9149
6) 1480 7) 4190 8) 4845 9) 35612
10) 38074 11) 53999 12) 5548 13) 57670
తిలక్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, టవర్ సర్కిల్-కరీంనగర్.

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571